సాక్షి రంగారెడ్డి
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



పదోన్నతులు లేనట్లేనా?


బదిలీలు, పదోన్నతులు, నూతన నియమాకాల విషయంలో ప్రభుత్వం కుంటిసాకులు చూపుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 8లో▸

నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిరణ్

నాంపల్లి: నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది జి.కిరణ్ కుమార్ గెలుపొందారు. శుక్రవారం నాంపల్లి కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. 132 ఓట్ల మెజారిటీతో సీనియర్ న్యాయవాది కిరణ్ విజయం సాధించడంతో సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

వీధి కుక్కల నివారణకు కృషి

సాక్షి, సిటీబ్యూరో: వీధి కుక్కల ప్రమాదాల నుండి ప్రజలను రక్షించేందుకు ఎన్జీవోలు సమష్టిగా కృషి చేయాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వీధి కుక్కల సమస్యల పరిష్కారానికి ఏర్పాటైన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వీధికుక్కలపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి సినిమా స్లైడ్స్ ప్రదర్శించాలన్నారు.



ఆ పంచాయతీలు ఉత్తమం

పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి వినియోగం, నీటి సమృద్ధి విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డులను శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లా రెడ్డి చేతుల మీదుగా అందుకుంటున్న నందిగామ మండలం కన్హా శాంతివనం సర్పంచ్ సరిత, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్ రెడ్డి. చిత్రంలో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు





న్యూస్‌రీల్

నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.30వేల జరిమానా

బాలికపై లైంగిక దాడి కేసు

మీర్‌పేట: ప్రేమపేరుతో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టులోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. వివరాలివీ.. నల్లగొండ జిల్లా చందంపేట మండలం నేరేడుగొమ్మకు చెందిన ఆలేటి ప్రభాకర్ (23) వృత్తిరీత్యా కూలీ. నల్లగొండ జిల్లా తుక్కుగూడ గ్రామానికి చెందిన బాలిక (16)కు ప్రభాకర్ ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి గుడిలో పెళ్లి చేసుకుని లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధిత బాలిక కుటుంబ సభ్యులు 2016 జూన్, 10న ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి నిందితున్ని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించి, సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ఎల్‌బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం దోషిగా నిర్ధారించి నిందితునికి పైవిధంగా తీర్పు చెప్పింది. కేసు దర్యాప్తు చేసిన అప్పటి మీర్‌పేట సీఐ రంగస్వామి కోర్టు ఆధ్వర్యంలో దాఖలు చేశారు. దీంతో పాటు బాధితురాలికి పరిహారంగా రూ.3 లక్షలు ఇచ్చారు.

నూతన నియామకం



హుడాకాంప్లెక్స్: తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా టేకుల మంజులారెడ్డిని నియమిస్తూ శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్‌లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర గౌరవ సలహాదారు శీలం శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు బాలు యాదవ్, అనుబంధ సంఘాల కార్యదర్శి నగేష్‌యాదవ్ చేతులమీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. కొంత కాలంగా మంజులారెడ్డి చేస్తున్న కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని కార్యదర్శి పదవిని అప్పగించినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా రైతు సంఘాలను ఏర్పాటు చేసి వారికి చేయూత అందిస్తానని తెలిపారు. సమాజంలో మహిళలను సంఘటితం చేయాల్సిన అవసరం ఉందని, తనపై నమ్మకంతో పదవికి ఎంపిక చేసినందుకు మహిళా శక్తిని ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు.

రాహుల్‌పై బీజేపీ కుట్ర

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాంగ్రెస్‌పార్టీ అధినేత రాహుల్ గాంధీపై బీజేపీ కుట్ర పన్నిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు. ఈ కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ పార్లమెంటులో అడుగుపెడితే ప్రధాని మోదీ, అదానిల మధ్య ఉన్న రహస్య ఒప్పందాలు బయటపడుతాయనే భయంతోనే చర్యలకు ఉపక్రమించారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉసిగొల్పి, వారిపై దాడులకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ నేతలు సంకేపల్లి సుధీర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, చింపుల సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మార్టిగేజ్'పై క్రిమినల్ చర్యలకు సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ ఫేబుల్‌కౌంటీ వెంచర్‌లోని మార్టిగేజ్ ప్లాట్‌ల అక్రమ రిజిస్ట్రేషన్‌లపై హెచ్‌ఎండీఏ క్రిమినల్ చర్యలకు సన్నాహాలు చేపట్టింది. సుమారు 29 మార్టిగేజ్ ప్లాట్‌లను సదరు రియల్టర్లు తమ కుటుంబ సభ్యుల పేరిట పార్టిషన్ డీడ్ చేసిన ఉదంతాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో అప్రమత్తమైన హెచ్‌ఎండీఏ అధికారులు ఇప్పటికే చట్టపరమైన చర్యలు చేపట్టారు. పార్టిషన్ డీడ్‌ను రద్దు చేసి, బాధ్యులైన అధికారులపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ రిజిస్ట్రార్ శాఖ ఐజీకి లేఖ రాశారు.

అందని ద్రాక్షేనా..!

ఒకప్పుడు 'రిచ్‌మెన్ క్రాప్'గా గుర్తింపు

- పదేళ్ల క్రితం వరకు పది వేల ఎకరాల్లో సాగు
- ప్రస్తుతం ఆసక్తి చూపని రైతులు
- 132 ఎకరాలకే పరిమితమైన పంట
- మహారాష్ట్ర నుంచి అధికంగా దిగుమతి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకప్పుడు తీపిని పంచిన ఫలాలు ప్రస్తుతం అందని 'ద్రాక్ష' పుల్లన అనే స్థితికి పడిపోయాయి. జిల్లాలో ద్రాక్ష తోటలు క్రమంగా కనుమరగవుతున్నాయి. ఒకప్పుడు అధిక దిగుబడులతో నగరవాసుల అవసరాలను పూర్తిగా తీర్చి.. ఇతర దేశాలకు ఎగుమతి చేసిన రైతులు నెమ్మదిగా సాగుకు దూరమవుతున్నారు. పదిహేనేళ్ల క్రితం వరకు పదివేల ఎకరాల్లో ద్రాక్ష తోటలు సాగైతే.. ప్రస్తుతం 132 ఎకరాలకు పడిపోయింది. చీడపీడల బెడదకు తోడు భూగర్భజలాలు అడుగంటడం, కూలీలు దొరక్కపోవడం, ఎరువులు, మందుల ఖర్చులు అమాంతం పెరిగిపోవడం, పండిన పంటకు సరైన మార్కెటింగ్ లేకపోవడంతో రైతులు సాగుకు దూరమవుతున్నారు. ఎగుమతి చేసిన దశ నుంచి దిగుమతి చేసుకునే స్థితికి పరిస్థితి దిగజారింది.

మొదటిసారిగా టోలిచౌకిలో సాగు

స్వాతంత్య్రానికి ముందు ద్రాక్షతోటలు నిజాం నవాబుల బ్యాక్‌యార్డ్(ఇంటి వెనుక గార్డెన్)ల్లో సాగయ్యేవి. అదీ ఒకటి రెండు చెట్లే కనిపించేవి. ఈ పంటకు 1963లో 'అనబిషాయి'గా నామకరణం చేశారు. టోలిచౌకిలో గద్దె రామకోటేశ్వరరావు తొలిసారిగా పంటను సాగు చేశారు. అప్పట్లో ఎకరానికి ఆరు నుంచి ఏడు టన్నుల దిగుబడి వచ్చింది. సాధారణంగా సమశీతోష్ణ మండలంలో పండే పంటను హైదరాబాద్ పరిసరాల్లో పండించి చరిత్ర సృష్టించారు. ఇందుకు ఆయన్ను అప్పటి ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. ఆ తర్వాత అప్పటి వరకు ఉగండా, కెన్యా, దక్షిణాఫ్రికా దేశాల్లో స్థిరపడిన వారు అక్కడి అలజడుల కారణంగా హైదరాబాద్‌కు వలస వచ్చారు. పెద్ద మొత్తంలో భూములు కొనుగోలు చేసి 'అనబిషాయి' వెరైటీ ద్రాక్షను సాగు చేశారు.

పూర్‌గా 'రిచ్‌మెన్ క్రాప్'

గుజరాతీలను చూసి బిర్లాలు ఇతర ప్రాంతాలకు చెందిన ధనవంతులు ఈ పంటపై దృష్టి సారించారు. దీంతో ఆ పంటకు 'రిచ్‌మెన్ క్రాప్'గా పేరొచ్చింది. ఇదే సమయంలో ఆంధ్ర నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన మరికొంత మంది తమ భూముల్లో ద్రాక్షను సాగు చేశారు. దిగుబడితో పాటు లాభాలు అధికంగా ఉండటంతో 1990 తర్వాత స్థానిక రైతులు కూడా ఈ పంటపై దృష్టి సారించారు. 1991లో హైదరాబాద్ వేదికగా గ్రేప్స్ పంటపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. నగరం గ్రేప్స్ రాజధానిగా గుర్తింపు పొందింది. ఇక్కడి రైతులను ఆదర్శంగా తీసుకుని మహారాష్ట్రలో కూడా సాగు ప్రారంభించారు. పంట భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తుండటంతో 2005 నుంచి పంట క్రమంగా కనమరుగవుతూ వస్తోంది. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో సాగుపై ఆసక్తి ఉన్న రైతులు కూడా వెనుకాడుతున్నారు.

ద్రాక్ష సాగు ఇలా..

సంవత్సరం	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	పంట దిగుమతి (మెట్రిక్‌టన్నులు)
2016-17	106.2	45
2017-18	74.10	427
2018-19	71.00	852
2019-20	110.00	1,650
2020-21	174.34	2,092
2021-22	132.55	1,586

నేటి తరానికి పరిచయం చేయాలనే..



13 ఏళ్లుగా ద్రాక్ష పంటను సాగు చేస్తున్నా. ఒకసారి మొక్క నాటితే 20 ఏళ్ల పాటు దిగుమతి వస్తుంది. మొదట్లో 'థాంసన్' వెరైటీని సాగు చేశా. తాజాగా 'మాణిక్ చమాన్' వెరైటీని ఎంచుకున్నా. ఎకరాకు వెయ్యి మొక్కలు నాటా. మొక్కల ఎంపిక సహా సస్యరక్షణలో చిన్నచిన్న మెలకువలు పాటించి నాటిన రెండేళ్లకే అనూహ్యంగా దిగుబడిని సాధించాను. ప్రస్తుతం ఒక్కో చెట్టు నుంచి 25 కేజీల వరకు దిగుమతి వస్తోంది. ఎకరాకు రూ.6లక్షల దాకా వస్తోంది. ఖర్చులు పోను రూ.3 లక్షలు మిగులుతుంది. నేటి తరానికి వీటిని పరిచయం చేయాలని భావించాను.

– కొమ్మిరెడ్డి అంజిరెడ్డి, తుక్కుగూడ, రైతు

తోటలను ప్రోత్సహిస్తున్నాం



2004 వరకు రెండు లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యేవి. రియల్ ఎస్టేట్ ప్రభావంతో సాగు విస్తీర్ణం దారుణంగా పడిపోయింది. ఎగుమతి దశ నుంచి దిగుమతి చేసుకునే స్థితికి దిగజారాం. మళ్లీ ఈ పంటకు పూర్వ వైభవం తేవాలని భావించాం. ఈ మేరకు ఆసక్తిగల రైతులను ప్రోత్సహిస్తున్నాం. విజయవంతంగా పంట సాగు చేస్తున్న రైతుల వద్దకు ఇతర రైతులను తీసుకెళ్లి, సాగులో సాధకబాధకాలు, సస్యరక్షణలో వారు అనుసరిస్తున్న మెలకువలను వివరిస్తున్నాం. విల్లాస్‌లో ఇప్పటికే కిచెన్‌గార్డెన్ సంస్కృతి వచ్చింది. వీటిలోనూ ద్రాక్ష సాగును ప్రోత్సహిస్తున్నాం.

– సునందారెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

శంకర్‌పల్లి సీఐపై వేటు

- సైబరాబాద్ కమిషనర్ కార్యాలయానికి అటాచ్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి సీఐ ఎం.మహేశ్‌గౌడ్‌పై సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర వేటు వేశారు. శుక్రవారం ఆయనను కమిషనరేట్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మాదాపూర్ సైబర్‌క్రైం సీఐగా పనిచేస్తున్న వి.ప్రసన్న కుమార్ కొత్త సీఐగా బాధ్యతలు స్వీకరించారు. గత నెల 28న 'ఆ సారు.. రూటే వేరు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎస్‌బీ, ఇంటలిజన్స్ అధికారులు విచారణ చేపట్టారు. నివేదిక రూపొందించి సైబరాబాద్ సీపీకి

సాక్షి ఎఫెక్ట్..

అందించారు. కాగా సీఐ మహేశ్ గౌడ్‌కు తన సొంత జిల్లాకు చెందిన మంత్రి అండదండలు మెండుగా ఉండటంతో పలు ఆరోపణలు నిజమని తేలినా ఉన్నతాధికారులు సస్పెండ్ చేయలేకపోయారని గుసగుసలు వినిపిస్తున్నాయి. మొత్తానికి చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లు సస్పెన్షన్ నుంచి తప్పించుకొని సీపీ కార్యాలయానికి అటాచ్ అయ్యారు. మహేశ్‌గౌడ్ సీపీ కార్యాలయానికి అటాచ్ అయిన ఆర్డర్ కాపీ వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది.

చిలుకూరు బ్రహ్మోత్సవాలు షురూ

- ఆలయంలో ప్రత్యేక పూజలతో అంకురార్పణ

మొయినాబాద్: కలియుగదైవం చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధాన మండపంలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాల పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదట సెల్వర్ కూత్తు నిర్వహించి.. వేద మంత్రోచ్చరణతో దేవాలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పుట్ట బంగారం (పుట్టమన్ను) తీసుకొచ్చి హోమగుండాలు ఏర్పాటు చేసి.. అందులో నవధాన్యాలు, పాలికలు కలిపి హోమాలను వెలిగించారు. తరువా విష్వక్సేనుడి ఆరాధన, పుణ్యాహవచన కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగించిన అనంతరం యజ్ఞం చేపట్టారు.రాత్రి 8 గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, బాలాజీ, మురళి, కన్నయ్య, నర్సింహన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గరుడ ప్రసాదం వితరణ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు ధ్వజారోహణం, శేషవాహనం నిర్వహించనున్నారు. ధ్వజారోహణం సందర్భంగా గరుత్మంతునికి సమర్పించే నైవేద్యాన్ని సంతానంలేని మహిళలకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు. గరుడ ప్రసాదంకోసం అధిక సంఖ్యలో మహిళలు వచ్చే అవకాశం ఉండటంతో తగిన ఏర్పాట్లు చేశారు.



బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు

పోషకాహారంతో ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి మోతి

- మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి మోతి

షాద్‌నగర్‌రూరల్: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే మనిషి సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉంటారని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి మోతి అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముగింపు కార్యక్రమం, పోషణ పక్షంలో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మోతితోపాటు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా అభ్యున్నతి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పెన్షను, కేసీఆర్ కిట్ల పంపిణీతో పాటు, సఖి సేవ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. నేటి కాలంలో రసాయనిక ఎరువులతో పండించిన పంటలను తినడంతో అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యంగా జీవించాలంటే పౌష్టిక విలువలతో కూడిన, సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యం తినాలని సూచించారు. అనంతరం షాద్‌నగర్ ప్రాజెక్టు పరిధిలో ఉత్తమ సేవలు అందించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగమణి, ఎంపీపీ ప్రియాంక, సబియా సుల్తానా, అలియా సుల్తానా, చెట్ల పావని, కృష్ణవేణి,లక్ష్మి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

వారెవ్వా ఇకబెనా



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో శుక్రవారం గురుసంహిత ఇకబెనా ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. మాజీ ఐఏఎస్ అధికారిణి శాలిని మిశ్రా, ఐపీఎస్ అధికారిణి సునీతారెడ్డి ప్రదర్శనను ప్రారంభించి విభిన్న ఆకృతుల్లో తీర్చిదిద్దిన పుష్పాలంకరణను చూసి మురిసిపోయారు. ఒహారా స్కూల్ ఆఫ్ ఇకబెనా హైదరాబాద్ చాప్టర్ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో మొదట ఇకబెనా గ్రాండ్ మాస్టర్ మీనా అనంత నారాయణకు నివాళులు అర్పించారు. అనంతరం ఇకబెనాకు ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. గురుసంహిత పేరుతో ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా 30వ వడిలోకి ఈ ప్రదర్శన అడుగుపెట్టింది. ప్రదర్శన శనివారం కూడా కొనసాగుతుందని అధ్యక్షురాలు నిర్మలా అగర్వాల్, ఇందుమతి వెల్లడించారు.

వేగశ్రీలో ప్రగ్యా జైస్వాల్ సందడి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడి ఎదురుగా ఏర్పాటు చేసిన వేగశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను శుక్రవారం ప్రముఖ సినీ నటి ప్రగ్యా జైస్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేగశ్రీ చైర్మన్ పనమా నవీన్, ఎండీ మణిదీప్ ఏచూరి, కళ్యాణ్ కుమార్ గోళ్ల, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేగశ్రీ జ్యువెలరీస్‌లో మహిళల మనసుదోచే బంగారు, వజ్రాలు, పోల్కి, కుందన్, విక్టోరియన్ ఆభరణాలు అబ్బురపరిచే రీతిలో ఆకర్షణీయమైన శ్రేణుల్లో కస్టమర్లకు అందుబాటులోకి తీసుకొచ్చామని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మెఘా సుధారెడ్డి చేతుల మీదుగా ఆకట్టుకునే ఆభరణాల శ్రేణిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విశేషంగా ఆకట్టుకునే రీతిలో అత్యుత్తమ జ్యువెలరీలో వేగశ్రీ ఇప్పటికే ఎంతో మంది ఆదరణ చూరగొంటున్నదన్నారు. తెలుగు వారి అభిరుచుల మేరకు..ప్రత్యేక డిజైనరీ ఆభరణాలను దృష్టిలో పెట్టుకొని కళాకారులతో వీటిని రూపు దిద్దేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి ప్రగ్యా జైస్వాల్

లారీలో 77 పశువులను తరలిస్తుండగా..


పశువులను తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు, బజరంగ్‌దళ్ సభ్యులు

కొత్తూరు: లారీలో అక్రమంగా పశువులను తరలిస్తున్నారని పక్కా సమాచారంతో శుక్రవారం కొత్తూరు పోలీసులు పెంజర్ల కూడలి వద్ద వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. లారీ లోపల 77 ఆవులు, గేదెలను ఎలాంటి రక్షణ పాటించకుండా హింసాత్మకంగా తరలిస్తున్నట్లు గుర్తించి ముచ్చింతల్‌లోని గోశాలకు తరలించారు. విచారణ అనంతరం పశువులను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్నారా? ఎక్కడైనా విక్రయించడానికి తీసుకెళ్తున్నారా? అనే విషయాలు తెలుస్తాయని ఎస్‌ఐ శంకర్ తెలిపారు. పశువులు పట్టించిన వారిలో బజరంగ్‌దళ్ సభ్యులు శివకుమార్‌చారి, విశాల్, రాజేందర్, సందీప్‌సింగ్, సాయిఅరుణ్, నరేష్‌చారి పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం వచ్చి మృత్యువాత

మంచాల: పొట్టకూటి కోసం బోరు బండిపై పనికి వచ్చిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని లోయపల్లిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామన్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన భరత్(21) అనే యువకుడు చౌటుప్పల్‌కు చెందిన బీరప్ప బోరువెల్ బండి పై పని చేస్తున్నాడు. లోయపల్లిలో ఓ రైతు పొలంలో బోరు వేసి పైపులు తీసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

షాద్‌నగర్ రూరల్: చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతయ్యాడు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. షాబాద్ మండలం కుర్వగూడ గ్రామానికి చెందిన ర్యాకల మల్లేష్(30) చేపలు పట్టేందుకు శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని ఎలికట్ట శివారులోగల లాడెం చెరువు వద్దకు వెళ్లాడు. ఎంతకూ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా యువకుడి బట్టలు, చెప్పులు చెరువు కట్టపై కనిపించాయి. చేపల కోసం వచ్చిన మల్లేశ్ చెరువులో పడి ఉండొచ్చని భావిస్తున్నారు. చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: మాసాబ్ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసాబ్‌చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. గురునానక్ కళాశాల విద్యార్థులు వేసుకునే షర్టు ధరించి ఉన్నాడు. ఎలాంటి ఆనవాళ్ళు లభించలేదు. మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉన్నట్లు అంచనా. వివరాల కోసం ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

నిధులు కేటాయించండి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వినతి


కేటీఆర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో శుక్రవారం మంత్రి కేటీఆర్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన వివిధ సమస్యలను మంత్రికి వివరించారు. ఆయా అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. పరిశీలిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. మంత్రిని కలిసిన వారిలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ ఉన్నారు.

బదిలీలు, పదోన్నతులు లేనట్లేనా?

- ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు
- కోర్టు తీర్పు నేపథ్యంలో ప్రక్రియకు విఘాతం


తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

షాబాద్: విద్యావ్యవస్థను పటిష్టం చేయడమే లక్ష్యమంటూ పదేపదే చెబుతున్న ప్రభుత్వం దశలవారీగా నీరుగారుస్తూ బదిలీలు, పదోన్నతులు, నూతన నియామకాల విషయంలో కుంటిసాకులు చూపుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైకోర్టు తీర్పు నేపథ్యంలో బదిలీల ప్రక్రియకు మరోసారి ఆటంకం ఏర్పడగా.. ఎనిమిదేళ్లుగా జిల్లాలోని వేల మంది ఉపాధ్యాయులకు మరోసారి నిరాశే ఎదురైంది.

14 తరువాత కోర్టు తీర్పు..

- చాలాకాలం తరువాత బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కాగా స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల పదోన్నతుల జాబితాను విద్యాశాఖ అధికారులు రూపొందించారు. సర్టిఫికెట్ల పరిశీలన సైతం అధికారులు నిర్వహించారు.
- సీనియారిటీ జాబితాను ప్రదర్శించే సమయంలో 317 జీఓ ద్వారా కొత్త జిల్లాలకు వెళ్లిన టీచర్లకు బదిలీ అవకాశం లేకుండా రెండేళ్ల కనీస సర్వీసు నిబంధన పెడుతూ విద్యాశాఖ జీఓ ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ కొంత మంది ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించగా హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పునివ్వడంతో బదిలీల ప్రక్రియ మరోసారి నిలిచిపోయింది.
- ఈనెల 14 తరువాత కోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉండడంతో ఈ ఏడాది కూడా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అవకాశాలు లేనట్లేనని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు తీర్పుకు అనుగుణంగా వెళ్లాలనుకుంటే మళ్లీ షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంటుంది.
- 317 జీఓ ప్రకారం వెళ్లిన టీచర్లు ఉమ్మడి జిల్లా సీనియారిటీని మళ్లీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ నిర్వహించాలంటే కనీసం రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ఈ విద్యా సంవత్సరం కూడా బదిలీల ప్రక్రియ కథ కంచికేనంటూ ఉపాధ్యాయులు నిట్టూరుస్తున్నారు.

ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులే..

రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో ఉపాధ్యాయులకు పదోన్నతులు జరిగాయి. మండల విద్యాధికారి పదోన్నతులు కేవలం ఉమ్మడి రాష్ట్రంలో 2005లో కల్పించారు. వారిలో 95శాతం మంది ఇప్పటికే పదవీ విరమణ పొందారు. జూనియర్ లెక్చరర్ల పదోన్నతులు 2001లో, డైట్ లెక్చరర్ల పదోన్నతులు 2000లో ఇచ్చారు. దాదాపుగా ప్రతీ ఉపాధ్యాయుడు కనీసం 10 ఏళ్ల సర్వీసు తర్వాత పదోన్నతి రావాలని ఆశిస్తారు. విద్యాశాఖలో మాత్రం ఏ కేడర్‌లో నియమితులైన ఉపాధ్యాయులు అదే క్యాడర్‌లో పదవీ విరమణ చెంది ఆర్థిక ప్రయోజనాలు నష్టపోతున్నారు. డైట్ కళాశాలలో కనీసం 20 మంది అధ్యాపకుల పోస్టులు ఉండాలి. కానీ ఒక్క అధ్యాపకుడూ లేని పరిస్థితి ఉంది. మండల విద్యాధికారులుగా గెజిటెడ్ హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలు ఇవ్వడంతో వారు తలకు మించిన భారంతో సతమతమవుతున్నారు.

నిర్లక్ష్యం తగదు



విద్యాశాఖపై నిర్లక్ష్యంతగదు. సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి, ఎంఈఓలను, డిప్యూటీ డీఈఓలను నియమించాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పదోన్నతులు నిర్వహించాలి. ఉపాధ్యాయుల విభజన ప్రక్రియ పూర్తియిన దృష్ట్యా వివిధ ఖాళీలను భర్తీ చేసేందుకు పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలి.

– సురదీర్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు

సర్కారుకు చిత్తశుద్ధి లేదు



ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం. ప్రభుత్వ పాఠశాలలపై సవతి తల్లి ప్రేమను చూపడం చూస్తుంటే విద్యారంగంపై ఏపాటి మక్కువ ఉందో తెలుసుకోవచ్చు.

– డి. నర్సింహులు, టీచర్, తాళ్లపల్లి

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

రాజేంద్రనగర్: వివిధ కేసుల్లో పట్టుబడిన వారిలో ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ 3వ స్పెషల్ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ నజీరుద్దీన్ షా తీర్పునిచ్చారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 16 మందిపై చార్జ్‌షీట్ నమోదు చేశారు. వీరికి శుక్రవారం రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలోని 3వ స్పెషల్ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ నజీరుద్దీన్ షా ముందు హాజరుపర్చగా వారికి రూ.57,950 జరిమానా విధించారు. వారిలో ఐదు మందికి జైలు శిక్ష విధించారు. నలుగురికి రెండు రోజుల చొప్పున, ఇద్దరికి నాలుగు రోజుల చొప్పున, ముగ్గురికి మూడు రోజుల చొప్పున శిక్ష విధించారు.

శ్వాస మీద ధ్యాసే ధ్యానం


ఇబ్రహీంపట్నంలోని ధ్యాన సెంటర్‌లో సీనియర్ మాస్టర్ అనూజకు సన్మానం

ఇబ్రహీంపట్నం: శ్వాస మీద ధ్యాసే ధ్యానమని పిరమిడ్ సిర్చువల్ మూమెంట్ సీనియర్ మాస్టర్ అనూజ తెలిపారు. ఇబ్రహీంపట్నం బృందావన్ కాలనీలోని జై హనుమాన్ ధ్యాన సెంటర్‌లో శుక్రవారం ధ్యాన బోధనపై ఆమె మాట్లాడుతూ మనసు, శ్వాస అనుసంధానమైతే ఏకాగ్రత వస్తుందన్నారు. నేర్చుకున్న విషయాలను ఆచరింపజేయాలన్నారు. మనతో మనం ఉండటమే ధ్యానం, లేకపోతే పరధ్యానమన్నారు. మనసులోని రకరకాల ఆలోచనలను ధ్యాన ప్రక్రియ దూరం చేస్తుందని, ఏకాగ్రతను ప్రసాదిస్తుందని, జీవితంలో స్థిరమైన నిర్ణయాలు తీసుకుని ఆనందోత్సవాలను పొందుతామన్నారు. ఇది ధ్యాన సాధనతో సాధ్యమౌతుందన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


రమేశ్ (ఫైల్)

నందిగామ: రైలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. హెచ్‌బీఎల్ నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నర్సప్పగూడకు చెందిన మెండే రమేశ్(55) గురువారం రాత్రి ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. శుక్రవారం తెల్లవారు జామున కుటుంబ సభ్యులు గమనించి చుట్టు పక్కల వెతకగా ఎక్కడా ఆచూకి లభించలేదు. హెచ్‌బీఎల్ నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహంపడి ఉన్న విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసి రమేష్ మృతదేహంగా గుర్తించారు. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ మాస్టర్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. రైలు ఢీకొట్టడంతోనే మృతి చెందినట్లు ఎస్‌ఐ వివరించారు. ఆత్మ హత్య చేసుకున్నాడా? లేక ప్రమాదవశాత్తు జరిగిందా? అనేది తెలియాల్సి ఉంది.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు కట్టుదిట్టం


మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో హనుమాన్ జయంతి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. శాంతియుతంగా ఊరేగింపులు జరుపుకోవాలని, పోలీసులతో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. రాచకొండ పరిధిలోని సున్నితమైన ప్రదేశాల్లో ఉత్సవాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, హనుమాన్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు శివరాం, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పోయిందని..

మనస్తాపంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య


వినోద్‌కుమార్ మృతదేహం

మణికొండ: ఉద్యోగం పోయిందని మనస్తాపంతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన తమ్ముడి ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నార్సింగి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన చండోలు వినోద్‌కుమార్(32), మాదాపూర్‌లోని వెరిజోన్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. వర్క్‌ఫ్రం హోం కారణంగా ఇంటి నుంచే పని చేస్తున్న అతను నెలకోసారి హైదరాబాద్‌లోని కార్యాలయానికి వచ్చేవాడు. అలా వచ్చినప్పుడు అలకాపూర్ టౌన్‌షిప్‌లోని హాల్‌మార్క్ సిల్వాసస్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న అతని తమ్ముడు రాజేష్‌కుమార్ ఇంట్లో ఉండే వాడు. ఈనెల 28న ఆఫీసుకు వెళ్లిన అతను సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. తమ సంస్థలో లే ఆఫ్ కారణంగా కొందరి ఉద్యోగాలను తొలగిస్తున్నారని, అందులో తాను కూడా ఉన్నానని, ఈనెల 30 వరకే ఉద్యోగం చేయాల్సి ఉందని తమ్ముడితో చెప్పాడు. గురువారం తన చివరి పని దినం కావటం, అదే రోజు రాజేష్ తన భార్యను ఆసుపత్రికి తీసుకుని వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వినోద్‌కుమార్ బెడ్‌రూంలో ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం ఆస్పత్రి నుంచి తిరిగి వచ్చిన రాజేష్ కాలింగ్ బెల్ కొట్టగా వినోద్‌కుమార్ ఎంతకూ తలుపు తెరవకపోవడంతో అపార్ట్‌మెంట్ మెయింటెనెన్స్ సూపర్ వైజర్ భానుచందర్ సహాయంతో తలుపులు తెరిచారు. బెడ్ రూంలో వినోద్‌కుమార్ ఉరివేసుకున్నట్లు గుర్తించిన రాజేష్ అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న డాక్టర్‌ను పిలిపించి చూపించగా అతను అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డోజర్ కిందపడి చిన్నారి దుర్మరణం

మణికొండ: ఓ చిన్నారిపై నుంచి డోజర్ వెళ్లడంతో మృతి చెందిన సంఘటన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సీబీఐటీ కళాశాల ఎదురుగా నిర్మాణంలో ఉన్న సెవన్ ఫ్రంట్‌లైన్ అపార్ట్‌మెంట్‌లో నీలంబాయి అనే మహిళ కూలీకి వెళ్తోంది. రోజు మాదిరిగానే శుక్రవారం తన కుమార్తె రాచిసాహు (18 నెలలు)ను తీసుకుని పనికి వెళ్లింది. చిన్నారిని ఓ చోట పడుకోబెట్టి నీలంబాయి పనిలో నిమగ్నమైంది. అదే సమయంలో అటుగా వచ్చిన డోజర్ వాహనం రివర్స్ తీసే క్రమంలో బాలికను గుర్తించకుండా చిన్నారిపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక తండ్రి రాం సాహు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.